సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం : 12 : ఏప్రిల్ : 2025



చీనీ టన్ను రూ.22,200

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీ గరిష్టంగా రూ.22,200, కనిష్టంగా రూ.3 వేల ప్రకారం ధర పలికాయి.



మరో ఐదు రోజులు వర్షాలు

జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ మేరకు రేకులకుంట ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు తెలిపారు.

గరిష్టం/కనిష్టం

39.8°/20.7°

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవి తాపం కొనసాగుతోంది. గంటకు 8 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

క్వింటా ఎండుమిర్చి రూ.14 వేలు



మార్కెట్‌కు వచ్చిన ఎండు మిర్చి

హిందూపురం అర్బన్: ఎండుమిర్చి ధర తగ్గింది. శుక్రవారం హిందూపురం మార్కెట్‌లో క్వింటా గరిష్టంగా రూ.14 వేలు మాత్రమే పలికింది. మార్కెట్‌కు 47.70 క్వింటాళ్ల మిర్చి రాగా, అధికారులు ఈ–నామ్ పద్ధతిలో వేలంపాట నిర్వహించారు. ఇందులో క్వింటా ఎండుమిర్చి గరిష్టంగా రూ.14 వేలు, కనిష్టంగా రూ.7 వేలు, సరాసరిన రూ.12,600 ప్రకారం ధర పలికినట్లు మార్కెట్ కార్యదర్శి జి. చంద్రమౌళి తెలిపారు. మార్కెట్‌కు వచ్చే సరుకు బాగా తగ్గుతున్నట్లు ఆయన వెల్లడించారు.

జీవీఎస్ పాఠశాల ఘటనపై అధికారుల విచారణ

ధర్మవరం: పట్టణంలోని జీవీఎస్ పాఠశాలలో ముగ్గురు విద్యార్థులను ఉపాధ్యాయురాలు చెప్పుతో కొట్టిన ఘటనపై శుక్రవారం ఎంఈఓలు రాజేశ్వరిదేవి, గోపాల్‌నాయక్ విచారణ చేపట్టారు. పాఠశాలకు వెళ్లిన వారు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాన్ని విచారించారు. అనంతరం ఎంఈఓలు విలేకరులతో మాట్లాడారు. జీవీఎస్ పాఠశాలలో గతంలో జరిగిన ఘటనలు, తాజాగా విద్యార్థులను చెప్పుతో కొట్టిన ఘటనపై సమగ్ర నివేదిక రూపొందించి జిల్లా విద్యాశాఖాధికారికి పంపిస్తామని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులను కొట్టడం, తిట్టడం, లైంగిక వేధింపులకు గురిచేయడం విద్యా హక్కు చట్టం ప్రకారం నేరమన్నారు. అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎంఈఓలు హెచ్చరించారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయాలు పనిచేస్తాయి

ప్రశాంతి నిలయం: నేడు రెండో శనివారం అయినప్పటికీ రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ కార్యాలయాలు పనిచేస్తాయని జిల్లా రిజిస్ట్రార్ కృష్ణకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఏప్రిల్ 12వ తేదీ ఉదయం 11 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ కార్యాలయాలు పని చేస్తాయన్నారు. ప్రజలు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

బడుగుల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే

- జయంతి వేడుకల్లో కలెక్టర్ టీఎస్ చేతన్



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ చేతన్, బీసీ సంఘాల నాయకులు

పుట్టపర్తి టౌన్/ప్రశాంతి నిలయం: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన జ్యోతిరావ్ పూలే ఆయా వర్గాలకు ఆశాజ్యోతిగా నిలిచారని కలెక్టర్ టీఎస్ చేతన్ కొనియాడారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పుట్టపర్తిలోని అబ్దుల్ కలాం షాదీమహల్‌లో జ్యోతిరావ్ పూలే 199వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీసీ సంక్షేమాధికారి నిర్మలాజ్యోతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి కలెక్టర్ టీఎస్ చేతన్ ముఖ్య అతిథిగా హాజరై పూలే చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమానత్వం కోసం, సామాజిక వివక్షపై పోరాడిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావ్‌పూలే అన్నారు. విద్యా వికాసంతోనే వివక్ష నిర్మూలన సాధ్యమని నమ్మిన గొప్ప వ్యక్తి జ్యోతిరావ్ పూలే అన్నారు. అలాంటి వ్యక్తి జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఎస్పీ విజయకుమార్, ఎల్‌డీఎం రమణమూర్తి, కురుబ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, వాల్మీకి సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులుతోపాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో వేడుకలు..

మహాత్మా జ్యోతిబా పూలే 199వ జయంత వేడుకలు శుక్రవారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి కలెక్టర్ చేతన్, పలువురు అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే జిల్లా పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎస్పీ రత్న పూలే చిత్రపటానికి పూల మాల వేసి పుష్పాంజలి ఘటించారు.

అక్రమ కేసులపై కలం కన్నెర్ర

- 'సాక్షి' పాత్రికేయులపై క్రిమినల్ కేసుల నమోదుపై ఆగ్రహజ్వాల
- వెంటనే కేసులు ఉపసంహరించుకోవాలని జర్నలిస్టుల డిమాండ్
- జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు, నిరసనలు, అధికారులకు వినతిపత్రాలు
- జర్నలిస్టులకు మద్దతుగా నిలిచిన మేధావులు, రాజకీయ నాయకులు



ప్రశాంతి నిలయం: అక్రమ కేసులపై కలం కన్నెర్ర చేసింది. నాలుగో స్తంభంగా ఉంటూ ప్రజాస్వామ్యాన్ని కాపాడే పాత్రికేయులపై కూటమి సర్కార్ కక్ష పూరిత చర్యలను నిరసించింది. పల్నాడు జిల్లాలో ఓ హత్యకు సంబంధించి వాస్తవాలను వార్తగా ప్రచురించిన క్రమంలో కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డితో పాటు ఆరుగురు జర్నలిస్టులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంపై జర్నలిస్టులు, రాజకీయ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కేసు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వాస్తవాలను ప్రజలకు ఎప్పటికప్పుడు చేరవేస్తూ.. అవినీతిపై యుద్ధం చేస్తోన్న పాత్రికేయులపై అక్రమ కేసులు నమోదు చేయడం సబబు కాదని అభిప్రాయపడ్డారు. ఈక్రమంలో శుక్రవారం జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు కదం తొక్కారు. నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు ఇచ్చి.. కేసు ఉపసంహరించుకునేలా ప్రభుత్వానికి నివేదించాలని కోరారు. జర్నలిస్టులపై అక్రమంగా బనాయించిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రజా శ్రేయస్సు కోసం నిత్యం పరితపించే జర్నలిస్టులపై కక్షపూరితంగా కుట్రలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

ప్రజాస్వామ్య వ్యవస్థకే సిగ్గుచేటు..

పాత్రికేయులపై కేసులు పెట్టడం ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటని సీనియర్ పాత్రికేయులు అభిప్రాయపడ్డారు. రాజ్యాంగంలో నాల్గో స్తంభంగా నిలిచిన మాధ్యమ వ్యవస్థకు సంకెళ్లు వేసే కుట్రలను ప్రభుత్వం మానుకోవాలని హితవు పలికారు. జర్నలిస్టులపై కేసులు నమోదు చేస్తే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పాత్రికేయులపై కేసు నమోదును నిరసిస్తూ ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం పుట్టపర్తిలో జర్నలిస్టులు నిరసనకు దిగారు. కలెక్టరేట్‌లో జేసీ అభిషేక్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు పుల్లయ్య, బాబు, దివిటీ రాజేష్, టీసీ బసయ్య, కె.గంగిరెడ్డి, మురళి, విజయశేఖర్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, సాయిక్రిష్ణారెడ్డి, సతీష్, టీసీ గంగాధర్, అంజిప్రసాద్, సాయికుమార్, ప్రశాంత్, రామాంజినేయులు, శ్రీనివాసులు, సాయి, అనిల్, నూర్ మహమ్మద్, శంకర్ పాల్గొన్నారు.



జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు, పాత్రికేయులు

అక్రమ కేసులు సరికాదు



నిజాన్ని నిర్భయంగా వెలికి తీసే జర్నలిస్ట్‌లపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేయడం సరికాదు. ఇది పత్రికా స్వేచ్ఛను హరించడమే. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన పాలకులే అందుకు విరుద్ధంగా వ్యవహరించడం దుర్మార్గం. కూటమి నియంతృత్వ పాలనలో రాష్ట్రంలోని జర్నలిస్టులకు భద్రత కరువైంది. ఇప్పటికైనా జర్నలిస్టులపై వేధింపులు, అక్రమ కేసులు ఆపాలి. లేకపోతే జర్నలిస్టులతో కలిసి ఈ ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేస్తాం.

– ఉషశ్రీచరణ్, జిల్లా అధ్యక్షురాలు, వైఎస్సార్ సీపీ

ప్రతి ఒక్కరూ ఖండించాలి



కూటమి ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను కాలరాస్తోంది. సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డితో పాటు మరో ఆరుగురిపై కేసు నమోదు చేయడమే ఇందుకు నిదర్శనం. పల్నాడు జిల్లాలో ఓ వృద్ధుడు పింఛను తీసుకునేందుకు వస్తే టీడీపీ నాయకులు దారుణంగా హత్య చేశారు. ఈ ఉదంతాన్ని సాక్షి పత్రిక ప్రజలకు కళ్లకు కట్టినట్లు చూపించింది. దీన్ని ఓర్వలేక ఎడిటర్‌పై కేసు నమోదు చేయడం దారుణం. ఈ చర్యను ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ధర్మవరం

ప్రజాస్వామ్యానికి ముప్పు



కూటమి ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛపై హరిస్తోంది. నిజాలు నిర్భయంగా రాసే జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించి భయపెట్టాలని చూస్తోంది. నిజంగా ఇది దారుణం. పత్రికా స్వేచ్ఛను హరించడం ప్రజాస్వామ్యానికే ముప్పు. ప్రజాస్వామ్యవాదులంతా ఇలాంటి చర్యలను ఖండించాలి. పాలకులు ఇప్పటికైనా మేల్కోవాలి. వెంటనే సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డితో పాటు మిగిలిన ఆరుగురు జర్నలిస్టులపై బనాయించిన కేసులను ఉపసంహరించుకోవాలి.

– దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, పుట్టపర్తి

కక్షసాధింపు తగదు



నిత్యం ప్రజల పక్షాన వార్తలు రాస్తూ... సమాజ అభివృద్ధి కోసం పాటు పడే పాత్రికేయులపై కేసులు నమోదు చేయడం మంచి పద్ధతి కాదు. ఏదైనా ఓ వార్తపై ఏదైనా అభ్యంతరం ఉంటే ఖండించే హక్కు ఎవరికైనా ఉంటుంది. కానీ ఇలా పాత్రికేయులపై కక్షసాధింపు ధోరణి చర్యలు దిగడం సరికాదు. పల్నాడులో 'సాక్షి' ఎడిటర్ ధనంజయరెడ్డితోపాటు మరో ఆరుగురు పాత్రికేయులపై అక్రమంగా బనాయించిన కేసులను ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలి. లేకపోతే ప్రజాస్వామ్యవాదులు, మేధావులతో కలిసి పోరాటం ఉధృతం చేస్తాం.

– చింతకాయల పుల్లయ్య, జిల్లా అధ్యక్షుడు, ఏపీయూడబ్ల్యూజే

'సాక్షి' ఎడిటర్‌పై కేసు దుర్మార్గం



నిజాలను నిష్పక్షపాతంగా రాసే సాక్షి పత్రికపై కక్ష కట్టి ఎడిటర్ ధనంజయరెడ్డిపై కేసు నమోదు చేయడం దుర్మార్గం. పల్నాడు జిల్లాలో వైఎస్సార్ సీపీ కార్యకర్తను హత్య చేసింది టీడీపీ నేతలే అనే విషయాన్ని సాక్షిలో ప్రచురిస్తే హంతకులను వదిలి ఆ పత్రిక ఎడిటర్‌పై కేసు నమోదు చేయడమేమిటి?. ఇది పత్రికా స్వేచ్ఛను హరించడమే. ప్రజాస్వామ్యాన్ని హరిస్తున్న కూటమి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయి. వెంటనే సాక్షి ఎడిటర్, మరో ఆరుగురు విలేకరులపై నమోదైన అక్రమ కేసులు ఎత్తివేయాలి.

– టీఎస్ దీపిక, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, హిందూపురం

జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

- పెనుకొండలో జర్నలిస్టుల డిమాండ్



ఏఓ గిరిధర్‌కు వినతిపత్రం ఇస్తున్న పెనుకొండ జర్నలిస్టులు

పెనుకొండ రూరల్: 'సాక్షి' ఎడిటర్ ఆర్. ధనుంజయరెడ్డితో పాటు మరో ఆరుగురు జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని పెనుకొండ జర్నలిస్ట్‌లు డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై కూటమి ప్రభుత్వం నమోదు చేసిన అక్రమ కేసులను నిరసిస్తూ శుక్రవారం పెనుకొండలోని పలువురు జర్నలిస్టులు ఆందోళనకు దిగారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో ఏఓ గిరిధర్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ.. పల్నాడు జిల్లాలో జరిగిన ఓ హత్యకు సంబంధించి బాధితులు తెలిపిన వివరాలతో 'సాక్షి' వార్త ప్రచురించిందన్నారు. దీన్ని సహించలేని టీడీపీ నేతలు జర్నలిస్టులపై కేసులు పెట్టారన్నారు. ఇది ముమ్మాటికీ పత్రికాస్వేచ్ఛపై దాడేనన్నారు. అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాక్షి జర్నలిస్టులు మల్లికార్జున, గోవిందు, జాకీర్, మురళీ (సాక్షి టీవీ), రామకృష్ణ (వార్త), ఆదినారాయణ (విశాలాంధ్ర), రామాంజి (సీమవార్త), హరి (రాజ్ న్యూస్), ఉదయ భాను (హెచ్‌ఎం టీవి), మహేష్ (ఆర్‌టీవీ) తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు పత్రికా స్వేచ్ఛను హరించలేవు

- చిలమత్తూరులో పాత్రికేయుల నిరసన



డీటీ జగన్నాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

చిలమత్తూరు: సాక్షి ఎడిటర్ ఆర్. ధనుంజయరెడ్డిపై కూటమి ప్రభుత్వం కక్షతో బనాయించిన కేసు అక్రమమని పాత్రికేయులు మండిపడ్డారు. నిజాలను నిష్పక్షపాతంగా ప్రచురించే పత్రికలను అణచివేయాలని చూడటం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే 'సాక్షి' ఎడిటర్ ధనుంజయరెడ్డితో పాటు మరో ఆరుగురు పాత్రికేయులపై నమోదు చేసిన అక్రమ కేసులను కొట్టివేయాలని డిమాండ్ చేశారు. అక్రమ కేసులు పత్రికా స్వేచ్ఛను హరించలేవన్నారు. ఉన్నవి ఉన్నట్టు రాస్తే ఇలా కేసులు బనాయించి ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లేలా చేస్తారా అంటూ ప్రశ్నించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ జగన్నాథ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల పాత్రికేయ సంఘం అధ్యక్షుడు గంగరాజు, ఆంజనేయులు(ఆంధ్రప్రభ), శంకర్ (ప్రజాశక్తి), సురేంద్రరెడ్డి(ది జర్నలిస్ట్) విశ్వనాథ్(బిగ్ టీవీ), నాగార్జున(కాకతీయ) నారాయణస్వామి(సూర్య న్యూస్), రామాంజనేయులు, వెంకటేష్(ఆర్టీఐ) తదితరులు పాల్గొన్నారు.

కేసులకు భయపడేది లేదు



కూటమి ప్రభుత్వం పాత్రికేయులను భయభ్రాంతులకు గురిచేసే విధంగా కేసులు నమోదు చేయడం తగదు. అక్రమ కేసులు నమోదు చేసినంత మాత్రాన ఎవరూ భయపడరు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం 'సాక్షి' ఎడిటర్ ధనంజయరెడ్డితో పాటు ఆరుగురిపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలి. లేకపోతే ప్రజాస్వామ్యబద్ధంగా న్యాయపోరాటం చేస్తాం.

– దివిటీ రాజేష్, స్టాఫ్ రిపోర్టర్, సాక్షి

ఉపసంహరించుకోకపోతే ఉద్యమాలే



ప్రభుత్వం పాత్రికేయులపై కక్ష సాధింపు ధోరణి వీడాలి. పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా వ్యవహరిస్తే ప్రజాస్వామ్యాన్ని హరించినట్లే. ప్రభుత్వం ఇదే ధోరణి అవలంబిస్తే భవిష్యత్తులో ఉద్యమాలు తప్పవు. వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చిన జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం.

– డి.బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీయూడబ్ల్యూజే

పంగుణి ఉత్సవం..ఆధ్యాత్మిక సౌరభం



శరీరానికి శూలాలు, కొక్కేలు గుచ్చుకున్న విలక్కులు లాగుతున్న భక్తులు

హిందూపురం: దశాబ్దాల క్రితం వచ్చి హిందూపురంలో స్థిరపడిన తమిళ, కేరళీయులు శుక్రవారం నిర్వహించిన పంగుణి ఉత్సవంతో పట్టణంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివెరిసింది. తమ ఆరాధ్య దైవమైన సుబ్రహ్మణేశ్వర స్వామి రథయాత్రను కేరళ, తమిళీయులు ఎంతో వైభవంగా నిర్వహించారు. ఉత్తర ఫాల్గుణి నక్షత్రాన్ని పురస్కరించుకుని పళని క్షేత్రంలో సుబ్రహ్మణేశ్వరుడికి పెద్ద ఎత్తున ఉత్సవాలు చేస్తారు. అదేరోజు స్థానికంగా స్థిరపడిన తమిళ, కేరళీయులు కూడా పంగుణి ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ క్రమంలో శుక్రవారం బెంగళూరు రోడ్డులోని పళనీనగర్, ఇందిరానగర్‌లో స్థిరపడిన వారంతా పంగుణి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలోని మూలవిరాట్ సుబ్రహ్మణేశ్వరస్వామికి విశేష పూజలు చేశారు. అనంతరం 14 రోజులుగా సుబ్రహ్మణ్యస్వామి మాలధరించిన వారంతా దవడల్లో శూలాలు గుచ్చుకుని, శరీరానికి కొక్కేలు తగిలించుకుని పుర వీధుల్లో ఊరేగింపుగా వెళ్లారు. మరికొందరు శరీరానికి గుచ్చుకున్న కొక్కేలతో విలక్కులు, ఆటోలను లాగారు. పళనీనగర్ నుంచి ఊరేగింపుగా బయలుదేరి బెంగళూరు రోడ్డు, చిన్నమార్కెట్, గాంధీ సర్కిల్, మెయిన్‌రోడ్డు గుండా పొట్టిశ్రీరాములు సర్కిల్, ఆర్‌పీజీటీ రోడ్డు, అంబేడ్కర్ సర్కిల్, మెయిన్ బజార్ మీదుగా తిరిగి ఆలయానికి చేరుకున్నారు. ప్రధాన వీధుల్లో ఊరేగింపుగా వస్తున్న భక్తులు, ప్రజలకు దాతలు చల్లని నీరు, మజ్జిగ, పానీయాలు అందించారు. టూటౌన్ సీఐ అబ్దుల్ కరీం ఆధ్వర్యంలో పోలీసులు గట్టి పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల పూజలు..

సుబ్రమణేశ్వర షష్టి సందర్భంగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి పార్టీ నేతలతో కలిసి బెంగళూరురోడ్డులోని సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు. మాలాధారణ పూజల్లో పాల్గొన్నారు. వేణురెడ్డి వెంట పార్టీ నాయకులు మనోజ్, శివ, మురుగన్, భాస్కర్, నవీన్, హరి ఉన్నారు.



సుబ్రహ్మణేశ్వరస్వామి మూలవిరాట్



వీపు, ఉదరానికి నిమ్మకాయలు గుచ్చుకుని వెళ్తున్న భక్తుడు



శరీరానికి కొక్కేలు తగిలించుకుని పచ్చిటెంకాయగుత్తిని లాగుతున్న దృశ్యం



వీపునకు కొక్కేలతో వేలాడుతున్న భక్తుడు

బీసీల ద్రోహి చంద్రబాబు

- లింగమయ్య మృతిపై నేటికీ స్పందించక పోవడం దుర్మార్గం
- బాధిత కుటుంబాన్ని జగనన్న పరామర్శించినా తట్టుకోలేకపోతున్నారు
- లింగమయ్య హత్యను కూటమి పార్టీల్లోని బీసీ నేతలూ ఖండించాలి
- మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



విలేకరులతో మాట్లాడుతున్న ఉషశ్రీ చరణ్

పరిగి: ''ఓట్ల కోసం బీసీ జపం చేసే చంద్రబాబు, కూటమి పార్టీల్లోని నేతలు ఏనాడూ బీసీల అభ్యున్నతికి కృషి చేయలేదు. పైగా బీసీలను అణగదొక్కేందుకు, అంతంచేందుకు ప్రయత్నించారు. కానీ బీసీలంటే ఎనలేని ప్రేమ చూపే జగనన్న బీసీ అంటే బ్యాక్‌బోన్ క్యాస్ట్ అని చెప్పడంతో పాటు తన హయాంలో పదవులిచ్చి పాలనలో భాగస్వామ్యం చేశారు. రాష్ట్రంలో బీసీ పక్షపాతి ఎవరైనా ఉన్నారంటే అది జగనన్నే. అందుకే కురుబ లింగమయ్య హత్యతో ఆయన చలించిపోయారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చారు. ఇలా చేయగలిగిన కూటమి నేత ఎవరైనా ఉన్నారా..కనీసం బీసీ మంత్రిగా ఉన్న సవిత అయినా ఆ కుటుంబాన్ని పరామర్శించరా'' అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ ప్రశ్నించారు. శుక్రవారం ఆమె మండలంలోని కొడిగెనహళ్లి పంచాయతీ పరిధిలో పర్యటించారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డిపల్లిలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల రామగిరి మండలంలో పాపిరెడ్డిపల్లిలో టీడీపీ గూండాల చేతిలో గాయపడి మృతి చెందిన కురుబ లింగమయ్య కుటుంబాన్ని కూటమి పార్టీల్లోని ఒక్క బీసీ ప్రజాప్రతినిధి అయినా కనీసం పరామర్శించారా.. అని ప్రశ్నించారు. పైగా వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో పాటు తామంతా బాధిత కుటుంబానికి అండగా నిలిబడితే దాన్ని కూడా తప్పుపడుతూ విమర్శలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి పార్టీల నేతలకు బీసీలపై ఉన్న ప్రేమకు ఈ ఘటనే నిదర్శనమన్నారు. బీసీ మంత్రిగా ఉన్న కురుబ సామాజిక వర్గానికి చెందిన సవితకు హత్యకు గురైన కురుబ లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించే తీరక లేదా అని ప్రశ్నించారు.

ఎంపీపీ పదవి కోసం దిగజారి రాజకీయం

రామగిరి ఎంపీపీ ఎన్నికలోనూ కూటమి నాయకులు దిగజారి రాజకీయం చేశారన్నారు. వైఎస్సార్ సీపీ తరఫున 9 మంది గెలిస్తే ఒక్క ఎంపీటీసీతో ఎంపీపీ సీటు కైవసం చేసుకునేందుకు మంత్రి సవిత, ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ వ్యవహరించిన తీరు చూసి సభ్య సమాజం తలదించుకుంటుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై రామగిరి ఎస్‌ఐ సుధాకర్‌యాదవ్ చేసిన వ్యాఖ్యలను ఆమె ఖండించారు. అధికారం శాశ్వతం కాదన్న విషయాన్ని అధికారులు గమనించి మసలుకోవాలని సూచించారు. తమ స్థాయి గుర్తించి మాట్లాడితే అందరికీ మంచిదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి పాల్గొన్నారు.

క్లుప్తంగా

తల్లిదండ్రులకు విద్యార్థుల అప్పగింత



కర్నూలు రైల్వేస్టేషన్‌లో విద్యార్థులతో ధర్మవరం పోలీసులు

ధర్మవరం అర్బన్: సరదాగా రైలు ఎక్కిన తప్పిపోయిన ఇద్దరు విద్యార్థుల ఆచూకీని పోలీసులు గుర్తించి తల్లిదండ్రుల వద్దకు సురక్షితంగా చేర్చారు. వివరాలు.. ధర్మవరంలోని కొత్తపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జస్వంత్, విజయ్‌కుమార్ గురువారం స్థానిక రైల్వే స్టేషన్‌లో సరదాగా రైలు ఎక్కిన విషయం తెలిసిందే. అయితే విద్యార్థులు ఎక్కిన సమయంలో రైలు ముందుకు కదలడంతో వారు కిందకు దిగలేకపోయారు. పిల్లలు ఎంతకూ ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన తల్లిదండ్రులు ఆరా తీయడంతో అసలు విషయం వెలుగు చూసింది. దీంతో వారి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసిన రెండో పట్టణ సీఐ రెడ్డప్ప.. చొరవ తీసుకుని ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో కర్నూలు రైల్వే స్టేషన్‌లో తచ్చాడుతున్న ఇద్దరు విద్యార్థులను గుర్తించిన ధర్మవరం పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున పిలుచుకొచ్చారు. కౌన్సెలింగ్ అనంతరం విద్యార్థులను తల్లిదండ్రులకు అప్పగించారు.

ప్రమాదంలో వ్యక్తి మృతి



బాబు (ఫైల్)

పావగడ: వాహనం ఢీకొన్న ఘటనలో ఓ ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. వివరాలు... పావగడ తాలూకా నాగలమడక హోబళి గ్యాదికుంటె గ్రామానికి చెందిన బాబు (45)కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గురువారం వ్యక్తిగత పనిపై పొరుగున ఉన్న శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలానికి వెళ్లాడు. రాత్రి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన ఆయన అదే మండలం తిమ్మాపురం–కొండాపురం గ్రామాల మధ్య ప్రయాణిస్తుండగా వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన వాహనం ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. బాబు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా దూసుకెళ్లిపోయాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వేడుకలకు వేళాయె..

- భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న చౌడేశ్వరీదేవి
- 16న శ్రీజ్యోతి ఉత్సవం





ఆలయంలో కొలువుదీరిన చౌడేశ్వరీ మూలవిరాట్, అమడగూరులో ప్రసిద్ధిగాంచిన చౌడేశ్వరీ ఆలయం, (ఇన్‌సెట్) అమ్మవారి ఉత్సవ మూర్తి

అమడగూరు: ఉమ్మడి జిల్లాలోనే అతి పెద్ద ఉత్సవాలకు పేరొందిన అమడగూరు చౌడేశ్వరీ దేవి ఉత్సవాలకు వేళైంది. దాదాపు ఎనిమిది శతాబ్దాల క్రితం అమరావతిగా పిలువబడిన అమడగూరులో వెలసిన చౌడేశ్వరీ ఆలయానికి ఎంతో విశిష్ట చరిత్ర ఉంది. భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న ఈ ఆలయంలో ఏటా చైత్ర మాసంలో ఆలయ కమిటీ సభ్యులు, అమడగూరు, చీకిరేవులపల్లి, గుండువారిపల్లి గ్రామ పంచాయతీ ప్రజల ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవాలను 8 రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తుంటారు. ఉత్సవాలకు ఉమ్మడి జిల్లా నుంచే కాక.. ఏపీలోని పలు రాష్ట్రాలకు చెందిన భక్తులు, తమిళనాడు, కర్ణాటక, కేరళ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేస్తుంటారు.

సందర్భం : నేటి నుంచి చౌడేశ్వరీ దేవి ఉత్సవాలు

అమ్మవారి ఉత్సవాల వివరాలు..

ఏటా చైత్ర మాసంలో ఉగాది పండుగ సందర్భంగా అమ్మవారిని 16 గ్రామాల ఊరేగింపునకు తీసుకెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. ఆ తర్వాత వచ్చే పున్నమితో ఎప్పటిలాగానే సంప్రదాయ బద్ధంగా నిర్వహించే అమ్మవారి ఉత్సవాలు ఈ ఏడాది కూడా శనివారంతో ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల వివరాలను ఆలయ ధర్మకర్త, మాజీ జెడ్పీటీసీ పొట్టా పురుషోత్తమరెడ్డి వెల్లడించారు. 12న కుంభకూడు, 13న ఊయల సేవ, 14న సూర్యప్రభ, 15న చంద్రప్రభ, 16న శ్రీజ్యోతి ఉత్సవం, 17న అశ్వ వాహనం, 18న సింహ వాహనం, 19న హంస వాహన సేవలు ఉంటాయి.

ఉత్సవాలకే తలమానికంగా..

అమ్మవారి ఉత్సవాలలో భాగంగా ఈ నెల 16న నిర్వహించే శ్రీజ్యోతి ఉత్సవానికి ఎంతో విశిష్టత ఉంది. ఈ ఉత్సవాన్ని ఏటా కొత్తపల్లికి చెందిన దంపతులు మాజీ జెడ్పీటీసీలు పొట్టా పురుషోత్తమరెడ్డి, ఉమాదేవి కుటుంబసభ్యులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాన్ని చూసేందుకు 4 రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వస్తుంటారు. ఆ రోజు ఉట్టి వద్ద నుంచి తీసుకొచ్చే జ్యోతి దర్శనంతో సకల పాపాలు తొలగి మంచి జరుగుతుందని భక్తుల విశ్వాసం. ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్నదానంతో పాటు కాలక్షేపానికి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

భక్తుల కోర్కెలు తీరుతాయి



నమ్మకంతో అమడగూరు చౌడేశ్వరమ్మతో కొలిచే భక్తుల కోర్కెలు తీరుతాయి. ఇందుకు ఎన్నో ఘటనలు ఉన్నాయి. కోర్కెలు తీరిన భక్తులు ఇక్కడి అమ్మవారిని తమ ఇలవేల్పుగా కొలుస్తున్నారు. గత మూడేళ్లుగా ఆలయాన్ని చాలా అభివృద్ధి చేశాం. ముఖ్యంగా దాతల చేయూత, కమిటీ సభ్యుల సహకారం మరువలేం. త్వరలో ఆలయం వద్ద రోడ్డు విస్తరణ పనులు కూడా పూర్తి చేస్తాం. భక్తుల స్నానమాచరించడానికి కోనేరు నిర్మాణం, విశ్రాంత గదులు, పార్కింగ్ సౌకర్యం తొందర్లోనే ఏర్పాటు చేయనున్నాం.

– పొట్టా పురుషోత్తమరెడ్డి, ఆలయ ధర్మకర్త

రేపటి నుంచి కొల్హాపురి మహాలక్ష్మీదేవి బ్రహ్మోత్సవాలు



కొల్హాపురి మహాలక్ష్మీదేవి అమ్మవారు

రొళ్ల: మండలంలోని రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి బ్రహ్మోత్సవాలు ఈ నెల 13న (ఆదివారం) సాయంత్రం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు రత్నగిరి సంస్థాన రాజవంశీకుడు దొర రంగప్పరాజు శుక్రవారం సాయంత్రం వెల్లడించారు. ఆదివారం సాయంత్రం అమ్మవారి మూల విగ్రహంతో పాటు ఉత్సవ విగ్రహానికి అంకురార్పణ, కుంకుమార్చన, అభిషేక పూజలు నిర్వహించనున్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వేదపండితుల సమక్షంలో గణపతి పూజ చేసి కలశ స్థాపనతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయన్నారు. అదే రోజు రాత్రి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధుల గుండా ఊరేగించి మధ్య రాత్రి అక్కడి నుంచి సమీపంలోని పాలబావి వద్దకు మేళతాళాలతో తీసుకెళ్లి గంగాజలంతో శుద్ధి చేసి పట్టువస్త్రాలు, గాజులు, వడి బియ్యం సమర్పించి, పూలు, పండ్లు నివేదించిన అనంతరం హారతి ఇచ్చి నైవేద్యంగా బావిలోకి సమర్పిస్తామన్నారు. 13న జలధి ఉత్సవం, కలశస్థాపన, 14న బ్రహ్మరథోత్సవం, ధూళోత్సవం, 15న జలధి, కలశ ఉత్సవం, గంగపూజ, 16 నుంచి 19వ తేదీ వరకు జ్యోతుల ఉత్సవాలు, 20న అమ్మవారికి పుష్పాలంకారణ, పోతులరాజుల విశేష పూజ, 21న పోతులరాజు బండారు కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ఒకే ఇంట్లో రెండు గిన్నిస్ రికార్డులు



గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించిన అక్క, చెల్లెలు కావ్య, ప్రణతి లక్ష్మి

ధర్మవరం: స్థానిక రాజేంద్రనగర్‌కు చెందిన ఉపాధ్యాయుడు సోమిశెట్టి రమేష్‌బాబు, శ్యామల కుమార్తెలు కావ్య, ప్రణతి లక్ష్మికు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు దక్కింది. జాతీయ సాంస్కృతిక శాఖ, కేంద్ర సంగీత నాటక అకాడమి సంయుక్తంగా ఈ ఏడాది జనవరి 24న న్యూఢిల్లీలో నిర్వహించిన విభిన్న రాష్ట్రాల్లోని 53 జానపద కళారూపాల ప్రదర్శనలో 5,194 మంది కళాకారులు పాల్గొన్నారు. ఈ ప్రదర్శనలో ఆంధ్రప్రదేశ్ తరఫున వీరిద్దరూ ప్రదర్శించిన జానపద నృత్యాన్ని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో నమోదు చేశారు. దీంతో వీరి పేర్లతో నమోదైన సర్టిఫికెట్లు శుక్రవారం అందడంతో అక్కాచెల్లెలు సంతోషం వ్యక్తం చేశారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థికసాయం

సాక్షి ఎఫెక్ట్..

ధర్మవరం అర్బన్: స్థానిక మహాత్మాగాంధీ కాలనీలో నివాసముంటున్న కిడ్నీ బాధితుడు మల్లిపోగుల శ్రీనివాసులు చికిత్సకు పూర్తి స్థాయిలో సహకరిస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ భరోసానిచ్చారు. రెండు కిడ్నీలు చెడిపోయి మంచానికే పరిమితమైన శ్రీనివాసులు దుస్థితిపై ఈ నెల 10న 'తండ్రి కోసం తనయ పోరాటం' శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనం తెలిసిందే. దీనిపై మంత్రి సత్యకుమార్ స్పందించారు. ఆయన ఆదేశాలతో బీజేపీ నియోజకవర్గ నేత హరీష్‌బాబు శుక్రవారం బాధితుడు శ్రీనివాసులును కలసి మాట్లాడారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం బాధితుడికి రూ.10వేల ఆర్థిక సాయాన్ని బీజేపీ నాయకులు కృష్ణాపురం జమీర్, షాన్‌షా అందజేశారు. మరికొందరు బీజేపీ నాయకులు రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించారు. మంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని ఏ ఆస్పత్రిలోనైనా శ్రీనివాసులుకు వైద్యం చేయిస్తామని హరీష్‌బాబు హామీనిచ్చారు. కార్యక్రమంలో మహిళా మోర్చా అధ్యక్షురాలు నిర్మల, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గీతామాధురి, లక్ష్మీప్రసన్న, చిగురుపాటి లక్ష్మి, పట్టణ అధ్యక్షుడు జింకా చంద్రశేఖర్, బిల్లే శ్రీనివాసులు, పోతుకుంట రాజు, కుంచపు నారప్ప, పెద్ద లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాసులు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న బీజేపీ నియోజకవర్గ నేతహరీష్‌బాబు

జగన్‌ను విమర్శించే స్థాయి నీకెక్కడిది?

- ఎస్‌ఐ సుధాకర్ యాదవ్‌పై ఎమ్మెల్సీ శివరామిరెడ్డి మండిపాటు
- తప్పు చేస్తే పోలీసులైనా చట్టం ముందు సమానమే
- నేర నిరూపణ అయితే యూనిఫాం తీసేసి శిక్ష అనుభవించాల్సిందే



ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

ఉరవకొండ: జనంలో అత్యంత ప్రజాదరణ కలిగిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి రామగిరి ఎస్‌ఐ సుధాకర్ యాదవ్‌కు లేదని శాసనమండలి ప్రివిలైజ్ కమిటీ చైర్మెన్/ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి అన్నారు. వజ్రకరూరు మండలం కొనకొండ్లలోని తన స్వగృహంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో టీడీపీకి తొత్తులుగా మారిన కొందరు పోలీసులను ఉద్దేశించి తప్పు చేసిన పోలీసులైన చట్టం ముందు సమానమేనని, వారి యూనిఫాం తీసేయిస్తామని వైఎస్ జగన్ వ్యాఖ్యానిస్తే... దానిని కూటమి ప్రభుత్వం వక్రీకరిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పోలీసు వ్యవస్థ నిర్వీర్యమైందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతిపక్ష నేతలుగా చంద్రబాబు, లోకేష్, పవన్‌కళ్యాణ్‌కు పటిష్ట భద్రతను అప్పటి సీఎం వైఎస్ జగన్ కల్పించారని గుర్తు చేశారు. ఈ అంశంపై అప్పట్లో ఒక్క ఆరోపణ కూడా లేదన్నారు. కూటమి ప్రభుత్వంలో అడుగడుగునా భద్రతా వైఫల్యం కనిపిస్తోందన్నారు. వైఎస్ జగన్ పాపిరెడ్డిపల్లి పర్యటనలో 1,100 మంది పోలీసులను, 200 మందిని హెలిప్యాడ్ వద్ద ఏర్పాటు చేసినట్లుగా పేర్కొంటూ భద్రతా వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. కేవలం అభిమానులను, కార్యకర్తలను ఆపడానికి పోలీసులను మోహరించారు కానీ, మాజీ సీఎం భద్రతకు కాదనే విషయం క్షేత్ర స్థాయిలో బట్టబయలైందన్నారు. వైఎస్ భారతిపై ఐటీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఏ పార్టీలోనైనా మహిళల వ్యక్తిత్వాన్ని తప్పు పట్టేలావ్యాఖ్యలు చేయడం తగదని, ఇలాంటి వారిని కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

ఉద్యాన రైతులూ అప్రమత్తంగా ఉండండి



అరటికి పోట్లు పెట్టిన దృశ్యం

అనంతపురం అగ్రికల్చర్: వాతావరణ మార్పులు, అధిక ఉష్ణోగ్రతలు, పెనుగాలులు, వడగండ్లు, అకాల వర్షాలు నమోదవుతున్న నేపథ్యంలో ఉద్యాన తోటలు సాగు చేస్తున్న రైతులు అప్రమత్తంగా ఉండాలని రెండు జిల్లాల ఉద్యానశాఖ అధికారులు జి.చంద్రశేఖర్, జి.ఫిరోజ్‌ఖాన్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రధానంగా పంట చేతికివచ్చే సమయం కావడంతో చీనీ, మామిడి, అరటి, బొప్పాయి, రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అరటి, బొప్పాయి పంటలు నేలవాలకుండా సరైన పోట్లు ఏర్పాటు చేసుకుంటే నష్ట తీవ్రత బాగా తగ్గుతుందని తెలిపారు. తోట చుట్టూ వెలుపలి ప్రాంతంలో నీటి తడి ఇస్తే సుడిగాలి తీవ్రత బాగా తగ్గిపోతుందన్నారు. పెను గాలులకు దెబ్బతిన్న తోటల్లో వెంటనే కాయలు, గెలలు తొలగించి, కొమ్మలను బయట పడేయాలన్నారు. చీడపీడల బారి నుంచి రక్షించుకునేందుకు లీటర్ నీటికి 2.5 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి పిచికారీ చేయాలన్నారు. నిల్వ ఉన్న వర్షపు నీరు ఆవిరైన తర్వాత పైపాటుగా ఎకరాకు 10 కిలోల యూరియా చల్లుకోవాలన్నారు. తోటల చుట్టూ అవిశె, సుబాబుల్ లాంటి రక్షణ పంటలు వేసుకుంటే పెనుగాలుల బారి నుంచి పంటలను కాపాడుకోవచ్చన్నారు. అవకాశం ఉన్న రైతులు కొన్ని మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే వేసవి సమస్యల నుంచి గట్టెక్కవచ్చని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేయాలి



రెవెన్యూ,సర్వే సేవలపై సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్.



సమీక్షలో పాల్గొన్న అధికారులు

ప్రశాంతి నిలయం: ప్రజలకు పారదర్శకంగా సేవలు అందిస్తూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ రెవెన్యూ, సర్వే అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో రెవెన్యూ సేవలపై రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, సర్వే అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీజీఆర్ఎస్, రెవెన్యూ అంశాలు, రీ సర్వే, ఆర్ఓఆర్ కేసుల నమోదు, వాటి పరిష్కారం, మ్యుటేషన్ ఆడిట్, అసైన్మెంట్ భూముల సమస్యలు, సర్వేయర్ల శిక్షణ తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ... నిర్దిష్ట గడువులోపు భూ సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే దరఖాస్తులు గడువులోపు నాణ్యతగా పరిష్కరించేలా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ సమస్యలను నాణ్యతగా పరిష్కారం చేయాలని, రీ సర్వే ప్రక్రియలో పురోగతి సాధించాలన్నారు. పీ-4 సర్వేకి సంబంధించిన పనులను మొబైల్ యాప్‌లో ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని, ఫ్రీ హోల్డ్ రెండో విడత రీసర్వే పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈనెల 15 నుంచి జిల్లాలో రీ సర్వే రెండో విడత ప్రారంభించాలని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్ఓ విజయసారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, పుట్టపర్తి, ధర్మవరం, కదిరి, పెనుకొండ ఆర్డీఓలు సువర్ణ, మహేష్, శర్మ, ఆనంద్‌కుమార్, సర్వే అండ్ ల్యాండ్ జిల్లా అధికారి విజయకాంతి బాయి, జిల్లాలోని 32 మండలాల తహసీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

కంది పంట రాబడిని అపహరించిన సైబర్ నేరగాళ్లు

బొమ్మనహాళ్/బెళుగుప్ప: ఆరుగాలం శ్రమించి సాధించిన కంది పంట రాబడిని సైబర్ నేరగాళ్లు అపహరించారు. వివరాలు.. బెళుగుప్పకు చెంది మహిళా రైతు నిర్మలమ్మ తనకున్న పొలంలో కంది పంట సాగు చేశారు. ఈ క్రమంలో పంట చేతికి రాగా, మార్కెట్‌లో విక్రయించగా వచ్చిన రూ.1.34 లక్షలను స్థానిక ఎస్‌బీఐ శాఖలోని తన ఖాతాలో జమ చేశారు. ఈ నెల 9న అర్ధరాత్రి వరుసగా మూడు మెసేజ్‌లు రావడంతో ఆమె పరిశీలించారు. రూ.24,500, రూ.24,960, రూ.50వేలు చొప్పున మొత్తం రూ.99,460 నగదు విత్‌డ్రా అయినట్లుగా తెలుసుకున్న ఆమె కంగుతిని, మరుసటి రోజు ఉదయమే బ్యాంక్‌కు వెళ్లి ఆరా తీశారు. ఖాతాలో లావాదేవీలను పరిశీలించిన బ్యాంక్ అధికారులు... న్యూఢిల్లీలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లోని ఓ ఖాతాకు బదిలీ అయినట్లు తెలిపారు. ఇది సైబర్ నేరగాళ్ల పనిగా నిర్ధారించడంతో శుక్రవారం పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

నల్లచెరువు: మండలంలోని నడింపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. గ్రామ శివారులోని పాడుపడిన బావిలో తేలియాడుతున్న మృతదేహాన్ని వెలికి తీయించారు. దాదాపు 35 ఏళ్ల వయస్సు ఉంటుందని, మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

బెల్లపు ఊట ధ్వంసం

వజ్రకరూరు: మండలంలోని బోడిసానిపల్లి తండాలో 150 లీటర్ల బెల్లపు ఊటను శుక్రవారం ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శివసాగర్ తెలిపారు. గోపాల్‌నాయక్, శంకర్‌నాయక్‌పై కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

13న రెడ్డి వివాహ పరిచయ వేదిక

రాప్తాడురూరల్: రాయలసీమ రెడ్డి జన సంఘం ఆధ్వర్యంలో ఈనెల 13న ఉచితంగా రెడ్డి వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేస్తున్నట్లు సంఘం వ్యవస్థాపకుడు రొద్దం సురేష్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు చంద్రమౌళిరెడ్డి, కార్యదర్శి దుబ్బా కిషోర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనంతపురం రూరల్ పాపంపేటలోని సంఘం కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఈ పరిచయ వేదిక జరుగుతుందని పేర్కొన్నారు. పిల్లలకు వివాహాలు చేయాలనుకునే రెడ్డి కులస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యువతీ, యువకుల బయోడేటాలు తీసుకురావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 94415 75641, 93902 84296, 94907 67224 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కలల సాకారానికి తొలిమెట్టు.. ఈ–సెట్

- ఇంజినీరింగ్ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ ద్వారా సెకండియర్‌లోకి అడ్మిషన్
- డిప్లొమా, బీఎస్సీ మ్యాథ్స్ విద్యార్థులకు సువర్ణ అవకాశం
- జేఎన్‌టీయూ(ఏ) ఆధ్వర్యంలో ఏపీ ఈసెట్ నిర్వహణ



జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల

అనంతపురం: ఉన్నత కలలకు ఏపీ ఈ–సెట్ తొలిమెట్టుగా నిలుస్తోంది. పేరెన్నికగల కళాశాలల్లో బీటెక్, బీఈ పూర్తి చేయాలంటే ఎంతో ఖర్చుతో కూడుకున్న పని. అదే ఏపీ ఈఏపీసెట్ (ఎంసెట్) ద్వారా గణనీయమైన ర్యాంకు సాధిస్తే ఈ కలను సాకారం చేసుకోవచ్చు. అయితే ఈఏపీ సెట్‌కు పోటీ అధికంగా ఉంటుంది. కానీ, మంచి కళాశాలల్లో ఇంజినీరింగ్ సీటు దక్కించుకునేందుకు ఏపీ ఈ–సెట్ మరో చక్కటి మార్గం. ఏపీ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఈ–సెట్)లో సత్తా చాటితే నేరుగా బీటెక్ సెకండియర్‌లో అడ్మిషన్ పొందవచ్చు. డిప్లొమా పూర్తి చేసిన వారు, బీఎస్సీ(మేథమేటిక్స్) పూర్తి చేసినవారు ఇందుకు అర్హులు. ఫార్మసీ కోర్సుల్లో సైతం అడ్మిషన్లు పొందడానికి ఈ–సెట్ దోహదపడుతుంది. యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలల్లోనూ సీట్లు దక్కించుకోవచ్చు. మొత్తం సీట్లలో 10 శాతం ఈ–సెట్ ర్యాంకర్లకు కేటాయిస్తున్నారు. దీంతో ఈ–సెట్ అనేది డిప్లొమా విద్యార్థులకు వరంలా మారింది.

క్రేజీ కంప్యూటర్ సైన్సెస్..

ఇంజినీరింగ్‌లో కంప్యూటర్ సైన్సెస్‌కు విపరీతమైన క్రేజ్ ఉంది. ఈ నేపథ్యంలో బీటెక్ కంప్యూటర్ సైన్సెస్ కోర్సుల్లో అడ్మిషన్ పొందాలంటే ఏపీఈఏపీ సెట్‌లో గణనీయమైన ర్యాంక్‌ను సాధించాల్సి ఉంటుంది. అదే డిప్లొమో కంప్యూటర్ సైన్సెస్ పూర్తి చేసిన వారు ఈ–సెట్ ద్వారా మంచి కళాశాలల్లో కంప్యూటర్ సైన్సెస్ కోర్సు దక్కించుకోవచ్చు. గతేడాది కంటే ఈ ఏడాది ఈ–సెట్ కంప్యూటర్ సైన్సెస్ బ్రాంచ్‌కు దరఖాస్తులు పెరగడమే ఇందుకు కారణం.

లేటరల్ ఎంట్రీ ద్వారా అవకాశం..

ఇంజినీరింగ్ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ ద్వారా రెండో సంవత్సరంలోకి అడ్మిషన్ పొందడానికి అవకాశం కల్పిస్తూ నిర్వహిస్తున్న ఏపీ ఈ–సెట్–2025కు భారీగా దరఖాస్తులు అందాయి. ఈ ఏడాది మొత్తం 33,454 మంది దరఖాస్తు చేసుకున్నారు. అగ్రికల్చర్ ఇంజినీరింగ్ విభాగానికి–143, బీఎస్సీ(మేథమేటిక్స్) –41, సిరామిక్ టెక్నాలజీ–3, కెమికల్ ఇంజినీరింగ్ –290, సివిల్ ఇంజినీరింగ్ –2,874, కంప్యూటర్ సైన్సెస్–10,639, ఈఈఈ–5492, ఈసీఈ–9,024, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ –54, మెకానికల్ ఇంజినీరింగ్ –4,424, మెటలార్జీ –97, మైనింగ్–66, ఫార్మసీ విభాగానికి –307 చొప్పున మొత్తం 33,454 దరఖాస్తులు అందాయి. దరఖాస్తు చేసుకునేందుకు గడువును మరింత పెంచడంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. ఈ నెల 12వ తేదీ వరకు రూ.వెయ్యి అపరాధ రుసుంతో దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే 17వ తేదీ వరకు రూ.2వేలు, 24వ తేదీ వరకు రూ.4వేలు, 28వ తేదీ వరకు రూ.10 వేల అపరాధ రుసుంతో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న వారికి మే 6వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు.

జేఎన్‌టీయూకు అవకాశం..

ఏపీ ఈ–సెట్‌ను ఇప్పటి వరకూ 8 దఫాలుగా నిర్వహించే అవకాశం జేఎన్‌టీయూ (ఏ)కు దక్కింది. 2015 నుంచి 2020 వరకు ఏపీ ఈసెట్‌ను రాష్ట్ర కన్వీనర్‌గా ప్రొఫెసర్ పీఆర్ భానుమూర్తి , 2021లో ప్రొఫెసర్ సి. శశిధర్, 2024లో ప్రొఫెసర్ పీఆర్ భానుమూర్తి విజయవంతంగా నిర్వహించారు. తాజాగా ప్రొఫెసర్ దుర్గాప్రసాద్‌ను ఈసెట్ కన్వీనర్‌గా నియమించారు.